క్లుప్తంగా

గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ శ్రేణుల భారీ ర్యాలీలు



మట్టవానిపాలెంలో కార్యకర్తలు, నాయకులు, మహిళల ర్యాలీ

రావికమతం: ఎన్నికల ప్రచారం చివరి రోజు శనివారం వైఎస్సార్‌సీపీ శ్రేణులు, అభిమానులు పలు గ్రామాల్లో భారీ ర్యాలీలు నిర్వహించారు. పార్టీ జెండాలు, బెలూన్లు పట్టుకుని పార్టీ గీతాలు ఆలపిస్తూ మహిళలు, యువకులు డాన్స్ వేస్తూ ప్రధాన వీధుల్లో ప్రచారం చేశారు. జగనన్న పథకాలు అమలు కావాలంటే ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని, ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను గెలిపించుకోవాలని కోరారు.

వైఎస్సార్‌సీపీ పాలనలోనే పేదలకు మేలు

కె.కోటపాడు: అనకాపల్లి ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు, ఎమ్మెల్యే అభ్యర్థి ఈర్లె అనురాధలకు మద్దతుగా గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు విస్తృత ప్రచారాన్ని నిర్వహించారు. సింగన్నదొరపాలెంలో పార్టీ నాయకులు రొంగలి వెంకటరమణ, లాలం శ్రీను, నారపాటి శ్రీరామ్మూర్తి ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్‌సీపీ పాలనలో పేదలకు మేలు కలిగిందని, సంక్షేమ పాలనకు మద్దతు పలకాలని కోరారు. ఈవీఎంలలో ఫ్యాన్ గుర్తుపై రెండు ఓట్లు వేయాలని అభ్యర్థించారు. కొరువాడ జగన్నాథపురంలో ప్రజలను సచివాలయ కన్వీనర్ చీపురపల్లి గోవింద కలిసి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు.

పంచాడ సురేష్‌పై సస్పెన్షన్ ఎత్తివేత

చీడికాడ: ఎల్.బి.పట్నం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు పంచాడ సురేష్‌పై సస్పెన్షన్ వేటు ఎత్తి వేసినట్లు ఆ పార్టీ మండలాధ్యక్షుడు గొల్లవిల్లి రాజుబాబు శుక్రవారం తెలిపారు. గతంలో పార్టీ నుంచి ఆయన్ను సస్పెండ్ చేశామన్నారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల విజయానికి తాను కృషి చేస్తానన్నారు. పార్టీ శ్రేయస్సుకు ఎప్పటిలాగే కష్టపడి పని చేస్తానన్నారు.

ముగిసిన ఎన్నికల ప్రచారం

చివరి రోజు భారీ ర్యాలీలు



వంటర్లపాలెం ప్రచారంలో స్థానిక నేతలు

మాడుగుల రూరల్: సార్వత్రిక ఎన్నికల ప్రచార పర్వం శనివారం సాయంత్రంతో ముగిసింది. నెల రోజులుగా మైకులు, డీజేసౌండ్లతో ప్రచారం హోరెత్తించారు. అధికార, ప్రతిపక్ష పార్టీలు ఇంటింటా ప్రచారంతోపాటు ర్యాలీలు నిర్వహించారు. మండలంలో 29 గ్రామ పంచాయతీలు, శివారు గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఈర్లె అనురాధ, ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు అన్ని గ్రామాల్లో విస్తృత ప్రచారం చేశారు. పార్టీ శ్రేణులు, నాయకులు, పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

స్వార్థ ప్రయోజనాలతో పార్టీ వీడిన రాజేష్

మాడుగుల రూరల్: వైఎస్సార్‌సీపీ పాలనలో నామినేటెడ్ పదవులు అనుభవించి, ఎన్నికల సమయంలో స్వార్థ ప్రయోజనాల కోసం పార్టీని వీడిన వారు చరిత్ర హీనులుగా మిగిలి పోతారని ఎం. కోడూరు పార్టీ అధ్యక్షుడు పడాల అప్పలనాయుడు అన్నారు. ఎం. కోడూరు పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి గొల్లవిల్లి రాజేష్ శనివారం వైఎస్సార్‌సీపీని వీడి బీజేపీలో చేరడంపై విమర్శించారు. రాజేష్ పార్టీని వీడినంత మాత్రం నష్టమేమీ లేదన్నారు. డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ఆశీస్సులతో పర్సన్ ఇన్‌చార్జి పదవి అప్పగించారని, అయినా సరే గౌరవం లేకుండా పార్టీని వీడటం మంచిది కాదన్నారు.

12 మద్యం సీసాలు స్వాధీనం

కొంకోట: మండలంలోని నరసింగబిల్లిలో 12 మద్యం సీసాలను శనివారం స్వాధీనం చేసుకుని, ఇళ్లపు ఈశ్వరరావు అనే వ్యక్తిని అరెస్టు చేశామని ఎస్ఐ రమేష్‌బాబు తెలిపారు. మద్యం సీసాలను అక్రమంగా విక్రయించడానికి తన ఇంట్లో నిల్వ ఉంచగా అతన్ని పట్టుకున్నామన్నారు.

ఫ్యాన్ గాలికి సై‘కిల్’

- ఎదురీదుతున్న టీడీపీ
- నిత్యం ప్రజల కష్టసుఖాల్లో తోడుగా ఎమ్మెల్యే ధర్మశ్రీ
- ఐదేళ్లుగా ప్రజల్లోకి రాని టీడీపీ అభ్యర్థి రాజు
- వైఎస్సార్‌సీపీ టీడీపీ మధ్యే ప్రధాన పోటీ



కరణం ధర్మశ్రీ
వైఎస్సార్‌సీపీ అభ్యర్థి



కెఎస్ఎన్ఎస్ రాజు
టీడీపీ అభ్యర్థి

చోడవరం: సంక్షేమ పాలన వైపే చోడవరం నియోజకవర్గ ప్రజలు మొగ్గ చూపుతున్నారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో 99 శాతం అమలు చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల విశ్వాసాన్ని చూరగొన్నారు. దీనికితోడు ఇక్కడ నాలుగు మండలాల్లో సిట్టింగ్ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ ఎంతో అభివృద్ధి చేశారు. ప్రజల్లో నిత్యం ఉంటూ వారి కష్టసుఖాల్లో తోడుగా ఉంటున్నారు. దాంతో వైఎస్సార్‌సీపీ వైపే జనం మొగ్గు చూపుతున్నారు. మరోవైపు ప్రతిపక్ష పార్టీ టీడీపీ ఎదురీదుతోంది. నియోజకవర్గంలో పదేళ్లపాటు టీడీపీ ఎమ్మెల్యేగా పని చేసిన కేఎస్ఎన్ఎస్ రాజు కనీసం చిన్నపాటి సమస్యలు పరిష్కరించలేక పోయారు. రెండుసార్లు రాజుకు అవకాశం ఇచ్చినప్పటికీ నియోజకవర్గాన్ని పూర్తిగా పట్టించుకోకపోవడం, ఎమ్మెల్యేగా గెలిచిన దగ్గర నుంచీ ఐదేళ్లలో ధర్మశ్రీ అన్ని గ్రామాలను ఎంతో అభివృద్ధి చేయడం వైఎస్సార్‌సీపీకి కలిసొచ్చే అంశంగా మారింది. ప్రధాన సమస్యలైన చోడవరం పట్టణం, వడ్డాదితో పాటు 26 గ్రామాలకు పూర్తిస్థాయిలో మంచినీరు అందించడం, గోతులుగా మారిన అంతర్గత రోడ్లన్నీ పూర్తిగా కొత్త రోడ్లు వేయించారు. నియోజకవర్గ అభివృద్ధిపై పూర్తిగా దృష్టిసారించడంతో మళ్లీ ధర్మశ్రీనే గెలిపించాలనే భావన ప్రతి ఒక్కరిలో ఏర్పడింది. మరో పక్క ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నెరవేర్చడంతో మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా చేసుకోవాలనే భావన నియోజకవర్గ ప్రజల్లో ఎక్కువగా కనిపిస్తోంది.

10 ఏళ్లపాటు ప్రజా సమస్యలు పట్టించుకోని రాజు

రెండుసార్లు ఎమ్మెల్యేగా రాజుకు అవకాశం ఇచ్చినప్పటికీ తన వ్యక్తిగత ప్రయోజనాలకే ప్రాధాన్యం ఇచ్చుకున్నారే తప్పా ప్రజల కష్టాలు, గ్రామాల సమస్యలు పట్టించుకోలేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ధర్మశ్రీకి సౌమ్యుడిగా, ప్రజల మనిషిగా నియోజకవర్గ ప్రజల్లో మంచి గుర్తింపు ఉంది. చెక్కు చెదరని ఆత్మవిశ్వాసంతో తనను నమ్ముకున్న ప్రజలకు సేవచేయాలని సంకల్పంతో నిత్యం అందుబాటులోనే ఉన్నారు. టీడీపీ అభ్యర్థి రాజు మాత్రం నాలుగేళ్లుగా ప్రజలకు దూరంగానే ఉన్నారు. గత టీడీపీ పాలనలో అధికార దర్పంతో రాజకీయాలు నెరపడం, తన పార్టీ నాయకులు చేసిన ఇసుక, మట్టి, జన్మభూమి కమిటీల దోపిడీలకు దన్నుగా ఉంటూ ప్రజల సమస్యలను గాలికి వదిలేశారనే విమర్శలు ఎక్కువగా ఉన్నాయి. ఇప్పుడు సొంత పార్టీలోనే అసమ్మతి కుంపటి చాపకిందనీరులా ఉండటం, ఆయన చేసిన గ్రూపు రాజకీయాలే తిరిగి మెడకు చుట్టుకునే పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుత ఎన్నికల ప్రచారంలో మిత్రపక్షాల నుంచి పూర్తి సహకారం కొరవడింది. వారంతా ఎక్కడా కలిసి పనిచేసిన దాఖలాలు లేవు. దీనితో రాజుకు మరోసారి ఓటమి తప్పదంటూ జన గళం వినిపిస్తోంది.



చోడవరం పట్టణం

ప్రజలు విశ్వసించని టీడీపీ మేనిఫెస్టో

చంద్రబాబు గతంలో డ్వాక్రా, రైతు రుణాల మాఫీ ఎగ్గొట్టడం, పలు హామీలను నెరవేర్చకపోవడంతో ప్రస్తుత ఆ పార్టీ మేనిఫెస్టోను ప్రజలు పూర్తిగా నమ్మడం లేదు. వైఎస్సార్‌సీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంపై అమితమైన నమ్మకం కలగడం, వారికి మేలు చేసే విధంగా నవరత్నాలు, మేనిఫెస్టోలో అంశాలు ఉండటంతో మరోసారి వైఎస్సార్‌సీపీ జెండా ఎగురడం ఖాయమని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.

నాల్గోసారి బరిలో వైఎస్సార్‌సీపీ, టీడీపీ అభ్యర్థులు

ఇక్కడ ప్రధాన ప్రత్యర్థులైన వైఎస్సార్‌సీపీ అభ్యర్థి కరణం ధర్మశ్రీ, టీడీపీ అభ్యర్థి కేఎస్ఎన్ఎస్ రాజు ఇప్పుడు నాలుగోసారి ఎన్నికల బరిలో తలపడుతున్నారు. 2009 ఎన్నికలో 867 ఓట్లు, 2014లో 1,132 ఓట్లతో రాజు గెలవగా, 2019లో 30 వేల భారీ మెజార్టీతో ఎమ్మెల్యే ధర్మశ్రీ గెలుపొంది సత్తా చాటారు. గెలిచిన దగ్గర నుంచి సీఎం జగన్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు నేరుగా ప్రజలకే అందుతున్నాయి. వారి కష్టసుఖాల్లో నిరంతరం తోడుగా ఉంటున్న ధర్మశ్రీని మరోసారి గెలిపించుకునేందుకు ఇక్కడ ప్రజలు ఆసక్తి కనబరుస్తున్నారు. వీరితోపాటు కాంగ్రెస్, సీపీఐ ఎంఎల్, బీఎస్పీ, ఇండిపెండెంట్ అభ్యర్థులు కేవలం పోటీలో పేరుకే ఉన్నట్టు ఉండటంతో ప్రధాన పోటీ వైఎస్సార్‌సీపీ, టీడీపీ మధ్యే ఉంది.

ప్రశాంత ఎన్నికలకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు

- 222 పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు పూర్తి
- ఎన్నికల రిటర్నింగ్ అధికారి సత్యవాణి

సాక్షి ఇంటర్వ్యూ



మాడుగుల: సార్వత్రిక ఎన్నికల ప్రచారం పర్వం శనివారం సాయంత్రంతో ముగిసింది. ఈ నెల 13న సార్వత్రిక ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో వాటి నిర్వహణకు ఎన్నికల అధికారులు పూర్తిస్థాయిలో సన్నద్ధమయ్యారు. ఎన్నికలకు ఇంకా ఒక్కరోజు మాత్రమే సమయం ఉండడంతో మాడుగుల నియోజకవర్గంలో అన్ని పోలింగ్ బూత్‌ల్లో ఏర్పాట్లు పూర్తి చేశారు. నియోజకవర్గంలో ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించడానికి అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి సత్యవాణి తెలిపారు. శనివారం ఆమె సాక్షితో మాట్లాడారు. ఇప్పటికే పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్, టాయిలెట్స్, ర్యాంపులు, తాగునీటి సదుపాయాలు కల్పించాం. శనివారం సాయంత్రం 6 గంటల నుంచి నియోజకవర్గంలోని 235 పోలింగ్ కేంద్రాలు పరిధిలో 144వ సెక్షన్ అమలు చేశాం. నియోజకవర్గంలో 1,88,989 మంది ఓటర్లు ఉండగా, వారిలో స్త్రీలు 96,886, పురుషులు 92,102, థర్డ్ జెండర్ ఒకరు ఉన్నారు. సమస్యాత్మకమైన 60 పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక బలగాలు ఏర్పాటు చేశాం. 235 పోలింగ్ కేంద్రాలకు 24 మంది సెక్టోరల్ ఆఫీసర్లు నియమించాం. స్థానిక ఆర్‌సీఎం పాఠశాల నుంచి 24 రూట్లకు పోలింగ్ సిబ్బందిని ఆర్టీసీ బస్సుల్లో సంబంధిత పోలింగ్ కేంద్రాలకు తరలించాం. ఈ నెల 13వ తేదీ ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ ప్రక్రియ జరుగుతుంది. పోలింగ్ అనంతరం ఈవీఎంలతోపాటు ఇతర పోలింగ్ మెటీరియల్‌ను అనకాపల్లి దరి శంకరంలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌కు తరలిస్తాం. ఈ నెల 11వ తేదీ సాయంత్రం 6 గంటలతో రాజకీయ నాయకులు ప్రచార ఘట్టం ముగిసింది. ప్రశాంత ఎన్నికలకు ఓటర్లు సహకరించాలని సూచించారు.

సంక్షేమం, అభివృద్ధి వైఎస్సార్‌సీపీకే సాధ్యం

చోడవరం ఎమ్మెల్యే అభ్యర్థి ధర్మశ్రీ కుమార్తె స్వాతి



బీబీ పట్నంలో కరపత్రాలు అందిస్తున్న నాయకులు రాజులనాయుడు, ఈశ్వరరావు

రోలుగుంట: వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కరణం ధర్మశ్రీ, ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడులను అధిక మెజార్టీతో గెలిపించాలని కోరుతూ బీబీపట్నం, కంచుగుమల గ్రామాల్లో స్థానిక నాయకులు ప్రచార కార్యక్రమాలు నిర్వహించారు. ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ కుమార్తె స్వాతి మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమాలు, అభివృద్ధి మరలా కొనసాగాలన్నా, వలంటీర్ సేవలు అందాలన్నా వైఎస్సార్‌సీపీకి మద్దతుగా నిలవాలని కోరారు. ఫ్యాన్ గుర్తుపై ఓటేసి వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. బీబీ పట్నంలో సర్పంచ్ గరగా విశ్వేశ్వరరావు, నాయకులు అయితిరెడ్డి రాజులనాయుడు, రేవళ్ల ఈశ్వరరావు, కంచుగుమల్లో ఎంపీటీసీ సభ్యుడు వద్దాది సతీష్, మాజీ సర్పంచ్ పరవాడ నాగేశ్వరరావు ఉత్సాహంగా పాల్గొన్నారు.

జగనన్న పాలనలోనే రాష్ట్రం సుభిక్షం

- ప్రతి ఒక్కరూ అండగా నిలవాలి
- పాచిలవానిపాలెం ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే అభ్యర్థి ఈర్లె అనురాధ



ప్రచారానికి వచ్చిన మహిళలతో అనురాధ

కె.కోటపాడు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలోనే రాష్ట్రం సుభిక్షంగా ఉందని, అన్ని వర్గాల ప్రజలకు ఎంతో మేలు చేశారని వైఎస్సార్‌సీపీ మాడుగుల ఎమ్మెల్యే అభ్యర్థి ఈర్లె అనురాధ అన్నారు. పాచిలవానిపాలెం, మల్లంపాలెం గ్రామాల్లో శుక్రవారం రాత్రి ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రెండు గ్రామాల్లో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని హారతులిచ్చి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అనురాధ మాట్లాడుతూ పాదయాత్ర సమయంలో ప్రజల కష్టాలను గుర్తించిన జగన్ ఆయా వర్గాలకు అధికారంలోకి వచ్చిన తర్వాత మంచిని చేసినట్లు తెలిపారు. గ్రామాల్లో ఎటు చూసినా అభివృద్ధి చేశారన్నారు. మహిళలకు సంక్షేమంలో పెద్దపీట వేసి ఆర్థికాభివృద్ధిని సాధించేందుకు తోడ్పాటు అందించారన్నారు. మంచి చేసిన జగనన్నకు ప్రతీ కుటుంబం తోడుగా నిలిచి ఎన్నికల్లో ఎంపీగా బూడి ముత్యాలనాయుడు, ఎమ్మెల్యేగా తనకు రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుపై వేసి గెలిపించాలని కోరారు. ప్రజలకు స్థానికంగా ఉండి ప్రజా సేవ చేసే అవకాశాన్ని కల్పించాలని అభ్యర్థించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దాట్ల శివాజీరాజు, వైస్ ఎంపీపీ రొంగలి సూర్యనారాయణ, ఎంపీటీసీ ఏటుకూరి రాజేష్, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి ఆకుల సాయిప్రసాద్, గండి సత్యనారాయణ, సిరపరపు నాయుడుబాబు, బొడ్డు దేముడుబాబు, రొంగలి నర్సింగరావు పాల్గొన్నారు.

చంద్రబాబు చెప్పేవన్నీ అబద్ధాలే

- ఎవ్వరూ నమ్మడం లేదు
- చోడవరం ఎమ్మెల్యే అభ్యర్థి కరణం ధర్మశ్రీ
- పలు గ్రామాల్లో విస్తృత ఎన్నికల ప్రచారం



రావికమతం: జి.చీడిపల్లిలో ఓటు అభ్యర్థిస్తున్న ధర్మశ్రీ



రావికమతం: ఆర్.కొత్తూరులో ప్రచారం చేస్తున్న ధర్మశ్రీ

రావికమతం: టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు చెప్పేవన్నీ అబద్ధాలేనని, జనం ఎవ్వరూ నమ్మడం లేదని ప్రభుత్వ విప్, వైఎస్సార్‌సీపీ చోడవరం ఎమ్మెల్యే అభ్యర్థి కరణం ధర్మశ్రీ అన్నారు. మండలంలోని కానాడ, ఆర్.కొత్తూరు, జి.చీడిపల్లి, దిబ్బలపాలెం గ్రామాల్లో శనివారం ఆయన విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్తశుద్ధితో 99 శాతం హామీలను అమలు చేస్తే రాష్ట్రం శ్రీలంక, పాకిస్తాన్ మాదిరి దివాలా తీసిందని హేళన చేసిన చంద్రబాబు ఈమారు మరో మోసపూరిత హామీలతో ఏకంగా రూ.12 లక్షల కోట్ల బడ్జెట్‌కుపైగా ఖర్చయ్యే మేనిఫెస్టో ఎలా ప్రకటించారని ప్రశ్నించారు. దీనిని ప్రజలెవ్వరూ నమ్మడం లేదన్నారు. మేనిఫెస్టోను భగవద్గీత, బైబిల్, ఖురాన్‌గా భావించే జగన్‌మోహన్‌రెడ్డి ఆచరణ సాధ్యమైనవే అమలు చేసి ప్రజల విశ్వాసాన్ని పొందారన్నారు. మళ్లీ ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి వస్తేనే ఈ పథకాలన్నీ అమలవుతాయని, వలంటీర్‌తో ఇంటింటికీ మళ్లీ పింఛన్ వస్తుందన్నారు. ఫ్యాన్ గుర్తుపై రెండు ఓట్లు వేసి మరో మారు అవకాశం కల్పించాలని కోరారు. ల్యాండ్ టైట్లింగ్ చట్టం గురించి తప్పుడు ప్రచారం చేసి ప్రజలు వారిని ఛీ కొడుతుండటంతో అడ్డంగా దొరికిపోయారన్నారు. ఎంపీపీ పైల రాజు, ఆ పార్టీ మండలాధ్యక్షుడు ముక్కా మహలక్ష్మినాయుడు, జెడ్పీటీసీ తలారి రమణమ్మ ఆదిమూర్తి, డిసిఎంఎస్ డైరెక్టర్ గుమ్ముడు సత్యదేవ, మండల సచివాలయ కన్వీనర్ కంచిపాటి జగన్నాధరావు, వైస్ ఎంపిపి దంట్ల వెంకటరమణ, మాజీ జెడ్పీటీసీ ఆశరి వాసుగోవిందరావు, ఆయా గ్రామాల ముఖ్య నాయకులు విరోది రాజారావు, కేశంశెట్టి నూకరాజు, సత్యనారాయణ పాల్గొన్నారు.

మోసకారి చంద్రబాబు హామీలను నమ్మకండి

బుచ్చెయ్యపేట: అధికారంలోకి ఎలాగైనా రావాలన్న తపనతో టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు లేనిపోని వాగ్దానాలతో ప్రజల్ని మోసం చేయడానికి వస్తున్నాడని ప్రభుత్వ విప్, చోడవరం ఎమ్మెల్యే అభ్యర్థి కరణం ధర్మశ్రీ తెలిపారు. నెల రోజులకుపైగా నిర్వహిస్తున్న ఎన్నికల ప్రచారం శనివారం వడ్డాదిలో విజయవంతంగా ముగిసింది. ప్రతి గ్రామంలో సచివాలయం, రైతు భరోసా, హెల్త్ సెంటర్, నాడు -నేడు పనులతో పాఠశాలలు అభివృద్ధి చేశామన్నారు. వడ్డాదిలో గౌరీపట్నం రోడ్డు, కేజీబీవీ, కాలేజీ, వడ్డాది నాల్గు రోడ్ల జంక్షన్ అభివృద్ధి తదితర పనులు చేశామన్నారు. కోటి రూపాయలతో కల్యాణ మండపం ఏర్పాటుతో పాటు, మినీ మండలం ఏర్పాటు, మోడల్ గ్రామంగా తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు. రెండేళ్ల కరోనా కష్టకాలంలోనూ జగనన్న మాత్రం సంక్షేమ కార్యక్రమాలు ఆపకుండా ప్రతి ఇంటికి రెండు లక్షల నుంచి ఐదు లక్షల రూపాయల వరకు లబ్ధి చేకూర్చారన్నారు. పేదల ఆర్థిక ఇబ్బందులు తొలగించాలని దృఢ సంకల్పంతో సీఎం జగనన్న పని చేస్తుంటే, వారికి సంక్షేమ పథకాలు అందకుండా చేయాలని చంద్రబాబు కుట్రలు, కుతంత్రాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. 14 ఏళ్లు సీఎంగా పని చేసి ప్రజల కోసం ఒక్క సంక్షేమ పథకమైన అందించారా అని ప్రశ్నించారు. డ్వాక్రా, రైతు రుణాలు మాఫీ చేయలేదన్నారు. ఆడపిల్ల పుడితే లక్ష రూపాయలు వేశాడా అని ప్రశ్నించారు. జెడ్పీటీసీ దొండా రాంబాబు, పార్టీ మండలాధ్యక్షుడు కె. అచ్చింనాయుడు, గోవాడ సుగర్ ఫ్యాక్టరీ మాజీ చైర్మన్ దొండా కన్నబాబు, డీసీసీబీ మాజీ డైరెక్టర్ కోవెల జనార్దనరావు, వైస్ ఎంపీపీ దొండా లలితా నారాయణమూర్తి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు కోరుకొండ లీలావతిరమణ, ఇంటి అప్పారావు, ఉల్లి భవాని, అయ్యన్నదొర, మురళి, ప్రసాద్, బాలాజీ పాల్గొన్నారు.



బుచ్చెయ్యపేట: వడ్డాది ఎన్నికల ప్రచారంలో ధర్మశ్రీకి హారతులు పడుతున్న ప్రజలు

హోరెత్తిన ధర్మశ్రీ ఎన్నికల ప్రచారం

చోడవరం: వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కరణం ధర్మశ్రీకి ప్రజలంతా నీరాజనం పట్టారు. అంబేరుపురం, గాంధీగ్రామం ప్రాంతాల్లో శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పెద్ద సంఖ్యలో యువకులు, మహిళలు పూలవర్షం కురిపించి, అడుగడుగునా హారతులు పట్టారు. ఇంటింటికి వెళ్లి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన సంక్షేమ పథకాలను ధర్మశ్రీ వివరించారు. ఐదేళ్లలో అన్ని గ్రామాల్లో ప్రధాన సమస్యలు పరిష్కరించానని, ఫ్యాన్ గుర్తుకు ఓటువేసి తనను గెలిపించాలని అభ్యర్థించారు. జెడ్పీటీసీ మారిశెట్టి విజయశ్రీకాంత్, ఎంపీపీ గాడి కాసు, సర్పంచ్ గాడి అప్పారావు, ఎంపీటీసీల మాజీ ఫ్లోర్ లీడర్ సూరిశెట్టి నాగదుర్గ గోవింద, ఎంపీటీసీ శరగడం నాగేశ్వరరావు పాల్గొన్నారు.

గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ శ్రేణుల విస్తృత ప్రచారం



వాలాబులో బైక్ ర్యాలీ చేపడుతున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు



వేచలంలో డమ్మీ ఈవీఎంల ద్వారా వివరిస్తున్న సర్పంచ్ శరారినాయుడు, నాయుడు

దేవరాపల్లి: అనకాపల్లి ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడుకు, మాడుగుల ఎమ్మెల్యే అభ్యర్థి ఈర్లె అనురాధకు మద్దతుగా మండల వ్యాప్తంగా వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఆఖరి రోజు శనివారం విస్తృతంగా ప్రచారం చేపట్టారు. వాలాబులో స్థానిక నాయకుడు పోడెల నానిబాబు ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. జైజగన్, జైబూడి నినాదాలతో హోరెత్తించారు. వేచలంలో సర్పంచ్ నాగిరెడ్డి శరారినాయుడు, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి ఆర్వీకే నాయుడు, గరిశింగిలో సర్పంచ్ గూడెపు రాము ఆధ్వర్యంలో డమ్మీ ఈవీఎంలతో ఓటు వేసే ప్రక్రియపై అవగాహన కల్పించారు. రెండు ఓట్లను ఫ్యాన్ గుర్తుపై వేసి గెలిపించాలని ఓటర్లను కోరారు.

అభివృద్ధి వెలుగులు

- వీధికొక సీసీరోడ్డు
- తాగునీటి సమస్య పరిష్కారం
- 45 కుటుంబాలకు నెరవేరిన సొంతింటి కల
- రూ.1.42 కోట్లతో పనులు పూర్తి
- పొడుగుపాలెం గ్రామస్తుల ఆనందం



రాముునాయుడు చెరువుకు నిర్మించిన మదుం



రామాలయం వీధిలో నిర్మించిన సీసీ రోడ్డు, డ్రైనేజీ

కె.కోటపాడు: వైఎస్సార్‌సీపీ పాలనలో ఎ.కోడూరు శివారు పొడుగుపాలెంలో అభివృద్ధి వెలుగులు ప్రకాశించాయి. ఇక్కడ సుదీర్ఘకాలంగా గ్రామాభివృద్ధి లేక ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన 58 నెలల్లోనే రూ.1.42 కోట్లతో అభివృద్ధి పనులు పూర్తయ్యాయి.

మట్టిరోడ్లు సీసీరోడ్లుగా మార్పు

గతంలో గ్రామంలోని ప్రధాన వీధులన్నీ మట్టిరోడ్లుగానే దర్శనమిచ్చేవి. వర్షాకాలం వచ్చిందంటే బురద రోడ్లపైనే రాకపోకలు సాగించాల్సిన దుస్థితి ఉండేది. ఈ నేపథ్యంలో గ్రామ సమస్యలను గుర్తించిన డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ప్రాధాన్యతా క్రమంలో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకున్నారు. రూ.40 లక్షలతో సూర్రెడ్డి, లెక్కల, కర్రి, బీసీ కాలనీల్లోను, రామాలయం, ఆంజనేయస్వామి ఆలయ వీధుల్లో సీసీరోడ్లు నిర్మించారు. మరో రూ.30 లక్షలతో చిన దొగ్గవారి నివాసాల్లో సీసీరోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి అనుమతులు మంజూరయ్యాయి. గ్రామస్తులకు గతంలో తాగునీటి సమస్య వేధించేది. జల జీవన్ మిషన్ నుంచి రూ.60 లక్షలు మంజూరు చేసి ఇంటింటి కుళాయిలు ఏర్పాటు చేశారు. దీంతో ఇంటి వద్దకే సురక్షిత మంచినీరు సరఫరా అవుతోంది.

– పటిష్టంగా సాగునీటి చెరువుల మదుములు

రాముునాయుడు, వెంకటరామ చెరువుల మదుములు మరమ్మతులకు గురవడంతో వర్షపు నీటిని నిల్వ చేసుకోలేని పరిస్థితి ఉండేది. పంటలకు అవసరమైన సమయంలో నీటిని మళ్లించుకునే అవకాశం లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఈ రెండు చెరువుల ఆయకట్టులో 200 ఎకరాల సాగు చేస్తున్న రైతులకు మేలు కలిగించేందుకు రూ.12 లక్షలతో మదుములు నిర్మించారు.

పూడికతీతతో తొలగిన ముంపు

వారాడ–గొండుపాలెం గ్రామాల మధ్య మొండిగెడ్డలో పూడిక పేరుకుపోవడంతో రెండేళ్ల క్రితం వరకు వరద ముంపుతో సమీప పొలాల్లో పంటకు నష్టం వాటిల్లేది. దీంతో మొండిగెడ్డలో పూడికతీత పనులు చేయడంతో ప్రస్తుతం పొడుగుపాలెం రైతుల పొలాలకు ముంపు సమస్య తొలగింది. గ్రామంలో ఇళ్ల లేని 45 మందికి నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకంలో ఇంటి స్థలంతోపాటు ప్రభుత్వం ద్వారా ఆర్థిక సహకారాన్ని అందించారు. దీంతో సొంతిళ్లు నిర్మాణాన్ని వీరు పూర్తి చేసుకున్నారు. గ్రామంలో ఏన్నోయేళ్లుగా జరగని అభివృద్ధి సీఎం జగన్‌మోహన్‌రెడ్డిపాలనలో పూర్తవడంతో గ్రామస్తులు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు.



పొడుగుపాలెంలో మొండిగెడ్డలో తీయించిన పూడికతీత

వివక్ష లేకుండా అభివృద్ధి



గ్రామంలో ప్రధాన సమస్యలను డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు దృష్టికి తీసుకెళ్లాం. వాటిని ఆయన ప్రాధాన్యతా క్రమంలో పరిష్కారానికి కోట్లాది రూపాయలు మంజూరు చేశారు. వీటితో ప్రధాన వీధుల్లో సీసీరోడ్లు, డ్రైనేజీలు నిర్మించాం. వివక్ష లేకుండా అభివృద్ధి చేపట్టేందుకు సహకారం అందించిన డిప్యూటీ సీఎంకు కృతజ్ఞతలు.

– లెక్కల గౌతమి, ఎంపీటీసీ, పొడుగుపాలెం

తొలగిన రైతుల కష్టాలు



రాముునాయుడు చెరువు, వెంకట రామ చెరువుల మదుములు 12 ఏళ్ల క్రితం మరమ్మతులకు గురయ్యాయి. అప్పటి నుంచి చెరువులో నీరు నిల్వ లేక సాగుకు ఇబ్బంది పడేవాళ్లం. ఈ సమస్య వైఎస్సార్‌సీపీ పాలనలో పరిష్కారమైంది. ప్రస్తుతం సాగు నీరు అందడంతో రైతులంతా హర్షం వ్యక్తం చేస్తున్నారు.

– యర్ల పాపునాయుడు, రైతు, పొడుగుపాలెం